


# శ్రీవారి తీరు

ఎమ్. హేమలత

"అమ్మా! డాడీవచ్చారు నిన్ను రమ్మంటున్నారు." అంటూ, వచ్చింది గీత అనూరాధ దగ్గరికి.

"అరే! మీ నాన్నగారు ఇంత తొందరగా వచ్చేశారా!" అంటూ, కల్పుతున్న చపాతీల పిండిని అక్కడే వదిలేసి గబగబా డ్రాయింగు రూముకేసి నడిచింది, అనూరాధ.

"అమ్మా! అమ్మా! నీ చేతులకంతా పిండి. కడుక్కొని వెళ్ళు..."అంది, గీత.

"పిండి తడపడం ఇంకా పూర్తికాలేదు గీతా! ఆఁ...అన్నట్టు గ్యాస్ అంటించి పాలగిన్నె కాస్త పెడతావూ...నేనొచ్చి మీ నాన్నగార్కి నెస్ కల్పుతాను." భర్తకేసి నడుస్తూ అంది, రాధ-అవిడే అనూరాధ.

"ఏంటండోయ్! యీ రోజింత పెందరాళే వచ్చారు. ఇంకా మూడు కూడా కాలేదే...!"

అనూరాధ మాటలకి వెనక్కి తిరిగాడు, మోహనరావ్. చెదరిన ముంగురులతో, పైకెత్తి దోపిన చీర కుచ్చెళ్ళతో, పిండి చేతులతో తనముందు సాక్షాత్కరించిన భార్యామణిని చూచి మొహాన్ని అసహనంగా త్రిప్పేసుకున్నాడు, మోహనరావు.

"పల్కరేమండీ! ఒంట్లోగాని బాగోలేదా...?" అంటూ, ముందుకొచ్చింది అనూరాధ.

ఆ పిండి చేతో తన తలని ఎక్కడ ముట్టుకుంటుందో అన్నభయంచేత, కాబోలు, మోహనరావ్ వెనక్కి వో అడుగువేశాడు.

"ఆఁ అదేం లేదురాధా...! కాశ్మీర్ అనుకున్న ట్రిప్పు ఇంకా ముందుపడింది. ఎల్లుండే ఢిల్లీ వెళ్ళాలి. అంతలోగా అన్నీ సిద్ధం చేసుకోవాలిగా. ఓ మారు అబిడ్స్ వెళ్ళి షాపింగ్, అదీ, పూర్తి చేసుకొని టైలర్‌కి చెప్పివస్తాను, రేపు యీవినింగ్ కల్లా సూట్ రెడీ కావాలని. ఔ...ది...ఔ..."

ఏదో చెప్పబోతున్న భర్తకి అడ్డు తగిలింది రాధ.

"అన్నట్టు... కాశ్మీర్‌లో ఎన్నాళ్ళేంటి మీ స్టే...?"

"ఐకాంట్ సే...ఏం! ఎందుకలా అడుగుతున్నావ్...?"

"అబ్బే! ఏంలేదండి.గీతకి పురిటిరోజులు కదా! సరిగ్గా మీరు వూర్లోలేని సమయంలో..."

"ఓహ్! ఏదో అనుకున్నాను. నేనుండి మాత్రం చేసేదేముంది రాధా. లేడి డాక్టరు రోజుమార్చిరోజు వచ్చి చూస్తూనే వుందిగా. ఫోన్‌చేస్తే ఐదు నిముషాల్లో వచ్చేస్తుంది. వినివే ..రేపో మారు మళ్ళీ ఫోన్‌చేసి చెప్తాను. ఓ.కే...!"

"డాడీ..! కాఫీ...ఏం డాడీ కాఫీ చేసే లోగానే తయారయ్యారు ఎక్కడికో వెళ్ళేందుకు...?" ప్రశ్నించింది, గీత.

"థాంక్యూగీతా ! ఏంలేదమ్మా. అబిడ్స్ వెళ్ళిరావాలి. బయట కార్లో మా డిప్యూటీ మేనేజర్ వెయిట్ చేస్తున్నాడు. గివ్ కాఫీ టు యువర్ మమ్మీ. ఓ.కే..." బయటకు నడిచాడు, మోహనరావ్.

చపాతీలు వత్తుతూన్న తల్లి చెంతకి చేరింది గీత.

"గీతా ! ఏంటా చతికిల బడడం. కుర్చీ మీద కూచో..." కసిరింది అనూరాధ.

"పర్వాలేదులేమ్మా. అమ్మా! నువ్వేం అనుకోనంటే నీకో చిన్న అడ్వైజ్...!" అంది, గీత.

"ఆఁ చెప్పమ్మా చెప్పు! కాలంమారి పోయింది. పెద్దలం మేము మీకు సలహా లివ్వ వలసిందిపోయి—మీ వద్దనుండి పుచ్చుకోవల్సి వచ్చింది" చపాతిని తీసి పెనంమీద వడేస్తూ అంది, అనురాధ.

"మరి డాడీ కాశ్మీరు వెళుతున్నారు కదా! ఏంచక్కా నువ్వు కూడా వెళ్ళకూడదూ. మళ్ళీ ఛాన్స్ వస్తుందా...ఏం!"

"నేనా...! మీ నాన్నగారితోనా!! నీ కేమయినా మతి పోయిందా గీతా! నెలలు నిండిన నిన్ను... బాగుందమ్మా. చాలా బాగుంది. గట్టిగా అనకు ఎవరైనా వింటే నవ్విపోతారు..." కాలినచపాతీని తీసి ప్లేట్లో వేసింది రాధ.

"నైన్త్ మంత్ వచ్చి టెన్ డేస్ కదమ్మా అయింది. అంతలోకి నాకేం పుడదు. నువ్వెప్పుడూ ఇంతే! నాన్నగారు నిన్ను సరదాగా రమ్మని పిలిచినా నువ్వెక్కడికీ వెళ్ళవు..." కొంచం కోపంగానే అంది, గీత.

తుళ్ళి పడింది అనూరాధ మనస్సు. ఇంతకీ ఆయన తనని కాశ్మీరు రమ్మని మాట వరసకు కూడా అనలేదు. పాపం, ఆయనదేం తప్పులేదు. ఎన్నోసార్లు ఎక్కడెక్కడికో రమ్మని పిలిచారు. తనే ఏదో సాకుచూపి ప్రతిసారి తప్పించుకుంటోంది. సంసారంలో పడ్డాక ఎన్నో ఇబ్బందులు. పైలా పచ్చీసులో వున్న యీ పిల్లలకి ఎలా అర్థమవుతాయి ఆ ఇబ్బందులు.

"గీతా! నాకు తెల్సు ఎప్పుడు ఎక్కడికి వెళ్ళాలో. నువ్వెళ్ళి ఆ ఫ్రిజ్‌లో వుండే బత్తాయి రసం తాగు..." అనూరాధా, బి. ఏ., కటువుగా అనటంతో అక్కడినుంచి కదిలింది కూతురు గీత.

* * *

"హలో! ఏస్...ఏస్. బి ఆన్ ది లైన్ ప్లీజ్. మమ్మీ! ఫోన్ కాల్ ఫర్ యు" బి. కాం. చదువుతోన్న అనూరాధ వంశోద్ధారకుడు ప్రభు రిసీవర్ అనూరాధ చేతి కందించాడు.

"హలో... అనూరాధా స్పీకింగ్... ఓ నువ్వా విమలా! ఎవరో అనుకున్నాను. ఏంటి కబుర్లు? ఆఁ...ఆఁ... ఏస్... ఏస్. మా వారొక్కరేనోయ్... డోంట్ బి సిల్లీ... నా కెలా తీరుతుందోయ్...ఐ కాంట్ లీవ్ గీతా అలోన్...ఎవరు చెప్పారోయ్ నేను కూడా వెళుతున్నట్లు? ఫంటాస్టిక్...మా వారు చెప్పటం... మీవారు వినడం ... చాలా బాగుంది ... సరేలే ! మీ ఇంటికి ఎనిమిది గంటలకు వస్తాను. ఈజిట్ ఓకే !" రిసీవర్ పెట్టేసి, అలాగే కూచుండి పోయింది, అనూరాధ. వరండాలో కూచుని పేపరు తిరగేస్తున్న గీతకానీ, క్రికెట్ బ్యాట్ తీసికొని గేటు దాటిన ప్రభుకానీ, ఇంకా ఇల్లు చేరని అనూరాధ ఆఖరు సంతానం సంగీతకానీ, ఆ క్షణంలో అనూరాధకి గుర్తు రాలేదు. కాశ్మీరు వెళ్ళే వుత్సాహంలో మధ్యాహ్నం కాఫీ కూడా సేవించకుండా షాపింగ్ కంటూ బయట పడ్డ భర్త మోహన్‌రావ్ కళ్ళముందు కదలాడాడు.

* * *

"ఇప్పుడు చెప్పు విమలా! మావారేంటి ఫామిలితో కాశ్మీరు వెళుతున్నట్లు చెప్పడం ఏంటి!?" అనూరాధ ముఖంలో కాసింత ఆందోళన చోటు చేసుకుంది.

"అనవసరంగా కంగారు పడకు అనూ! మిగతా మేనేజింగ్ డైరక్టర్లందరితోపాటూ, మీ వారు కూడా రెండు టికెట్లు రిజర్వు చేయించారట. అదే మాట మావారు నాతో అన్నారు. మరి నువ్వు కూడా వస్తావు కదూ... అంటే ఎగిరి గంతేసి... ఓకే అన్నాను, నువ్వు కూడా వస్తున్నావన్న సంతోషంతో. తీరా నీకు ఫోన్ చేస్తే..."

"కాశ్మీరు ట్రిప్పు ముందుకు వచ్చిందంటూ చెప్పారేతప్ప...నన్ను రమ్మంటూ అడగలేదోయ్ మావారు. మావారు రమ్మని పిలిచినా, నాకెలా తీరుతుందోయ్ ! గీతకి డెలివరీ టైం కదా !"

"ఏం...అయితే ! నీకంతా ఛాదస్తం అనూ ! ఆమాటకొస్తే మా పిల్లలకి కూడా ఓ పదిరోజుల్లో పరీక్షలున్నాయి. అంత మాత్రంచేత నేను బయలుదేరలేదూ ! దారి దాన్దే !"

"ఏమోబాబూ ! నువ్వుఇంత ధైర్యంగా బయలుదేరుతున్నావ్. నేనయితే పిల్లల్ని వదిలి అలా ఎక్కడికీ వెళ్ళను. వెళ్ళలేను." దృఢంగా అంటున్న అనూరాధ కేసి ఒక్కమారు చూసింది, విమల.

"పోన్లే అనూ ! ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి. ఎవరి అలవాట్లు వాళ్ళవి. అసలు విషయానికి వద్దాం. మరి నువ్వురాక మీ వారితో కాశ్మీరు వెళ్ళేదెవరంటావ్ !"

మళ్ళీ అనూరాధ ముఖం ప్రశ్నార్థక మయింది. తనభర్త తనతో మాటమాత్రం చెప్పకుండా ఎవరితోనో వెళుతున్నాడంటే — అది సహించరాని బాధగావుంది, అనూరాధకి. అనూరాధ ముఖంలో మారుతున్న భావాలని చదువుతూ కూచుంది విమల.

"విమలా ! నువ్విప్పుడిలా అడుగుతూంటే నాకు అన్పిస్తోంది మా వారు ఎప్పుడు ఎక్కడికెళ్ళినా తనతో రమ్మని

## "పొగ"ను పసిగట్టే "అలారమ్" పరికరం!

నిప్పును మాత్రమేగాదు పల్చగా వున్న వంట వాయువును దూరాన గల మంటల నుంచి వెలువడి వచ్చే పొగని కూడా పసిగట్టి గణగణ మని మ్రోగి హెచ్చరించే ఒక బహుళార్థక సాధక స్వయం చలిత గంటని జపాన్‌లో విజ్ఞానవేత్తలు తయారు చేశారు — ఈ పరికరం వున్న చోటుకి యిరవై అడుగులకి అవతల "సర్రున" అగ్గిపుల్ల గీసినా సరే యిది పసిగట్టి హెచ్చరిక చేస్తుంది. అదృష్టవశాత్తు ఎండలోను, ట్యూబ్‌లైటు కాంతి లోను యిది మ్రోగదు — కాని "గ్యాస్ స్టవ్" లీకవుతూ వుంటే మాత్రం గోలెట్టేస్తుంది. సిగరెట్ కాల్చేవారిక్కూడా యిబ్బందే కాబోలు దీనితో ...





# సత్వర నివారణకు శక్తివంతమైన మరియు విశ్వసనీయమైన అనాసిన్ తీసుకోనండి.

**బలీయమైనది!** అనాసిన్ నొప్పిని త్వరితంగా తగ్గిస్తుంది ఎందువల్లనంటే ప్రపంచమంతటా డాక్టర్లు సిఫారసు చేసే బాధా నివారక పదార్థాలను అది ఎక్కువగా కలిగియున్నది.

**విశ్వసనీయమైనది!** అనాసిన్ డాక్టరు ఇచ్చే విశ్వసనీయమైన ప్రిస్క్రిప్షన్ లాగా ఒక మందుల మిశ్రమం. అందువల్లనే లక్షలాది ప్రజలు అనాసిన్‌ను తీసుకొంటారు మరియు సిఫారసు చేస్తారు.

*జలుబులు మరియు ఫ్లూ, తలనొప్పి, నడుము నొప్పి, కండరాల నొప్పి మరియు పంటి నొప్పికి బాగా పనిచేస్తుంది.*




భారతదేశపు ఎక్కువ జనప్రియమైన నొప్పి నివారిణి
జెఫ్రీ మేనర్స్ వారి అనాసిన్ విభాగం నుంచి

*Regd. TM

A23-7/78



వేధించేవారు. నాకయితే, ఈ మధ్య—అదీ గీత పెండ్లయ్యాక ఎక్కడికీ వెళ్ళడానికి కుదరటం లేదుకదా!'' తగ్గు స్వరంతో మాట్లాడుతున్న అనూరాధనే చూస్తూ కూచుంది విమల.

''ఇక ఈవిడ ఎక్కడకూ రాదులెమ్మని, ఎవ్వరినో వెంటేసుకొనివెళ్ళుతున్నట్లున్నారు.'' అంటూ, కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్న స్నేహితురాల్ని చూచి విమల జాలిపడింది.

''అనవసరంగా ఆందోళనపడకు అనూ! ఒక్కక్షణం స్థిమితంగా ఆలోచించు మీ పెండ్లయి ఇరవై సంవత్సరాలయింది కదా! మీవారు ఎప్పుడైనా ఇలా చేసారా...?''

''లేదు విమలా! అందుకే నాకంత బాధగావుంది. అసలీమధ్య వారు సరిగ్గా మాట్లాడటం కూడాలేదు. నేనంత పట్టించుకోలేదు. ఇప్పుడు నాకు గుర్తుకొస్తున్నది. ఔన్లే. ముసలిదాన్నయిపోయాను. అమ్మమ్మను కూడా కాబోతున్నాను...'' వాపోయింది, అనూరాధ.

''భలేదానివే...! నువ్వు అమ్మమ్మవయితే మీవారు తాతవటంలే! ఆయన మాత్రం నిత్యపెండ్లికొడుకులాగేవుండిపోయారనుకున్నావా? నీ మీదవిరక్తితో మీ వారలా చేస్తున్నారని నేననుకోను. మోహనరావుగార్ని నేనెరుగనా ఏంటి...? అసలు తప్పంతా నీలోనేవుంది...!!''

విమల ఆరోపణకి నివ్వెరపోయింది అనూరాధ.

''నాలోనా...!!''? కొంచెం కోపంగా అంది అనూరాధ.

''కాకుంటే...ఏంటోయ్ ఇప్పుడు నీ వయస్సెంత...?''

''నా వయస్సా! ఏం...ఎందుకు! ఈ జూన్‌కి 38 వెళ్ళాయి.''

''మీ వారు నీకన్న మూడేండ్లు పెద్ద కదూ...!''

''అవును విమలా! నీకేమైన మతిపోయిందా? ఇప్పుడు మా యిద్దరి వయస్సుతో పనేంటి?''

''ఉంది కాబట్టే అడుగుతున్నాను. నలభై సంవత్సరాలు దాటిన మగవాళ్ళెందరో– ఈ కాలంలో– పెండ్లి చేసుకుంటున్నారు...''

"ఓ...సరేలే! ఆడపిల్లలు ముప్పై దాటాక వివాహాలు వెలగబెట్టుతున్నారు." ఈసడింపుగా అంది, అనూరాధ.

"ఏం... దాంట్లో తప్పేముంది. నీలాగ పద్దెనిమిదేండ్లకే పెండ్లిచేసుకుని—ముప్పై ఏండ్లకే ముసలమ్మలయిపోవాలా!? చూడు అనూ! నీకున్న వయసుకి ఓ పదేళ్లు ముందే సుకుని నువ్వు ముసలి దానివని అనుకొంటు న్నావ్! కానీ, మీవారు మంచి యవ్వనంలో వున్నారు. ఆ విషయం నీ మట్టి బుర్ర కెపుడయినా తోచిందా ...?"

విమల మాటల్లోని సారాంశాన్ని బుర్ర కెక్కించుకోవటానికి ప్రయత్నిస్తూ కూచుంది అనూరాధ.

"అనూ! నే నిలా అంటున్నానని బాధ పడకు. నీకూ నాకూ వయస్సు తేడా ఎంత?" ఓ రెండేళ్లే కదా! నువ్వుమాడు ఎంత ముసలిదానిలా డ్రస్ చేసుకున్నావో?"

"పోన్లే విమలా! నీలా అంత స్మార్ట్‌గా వుండటానికి నాకు తీరికెక్కడిది. అయినా అవసరం ఎక్కడిది?" నిష్ఠూరంగా అంది, అనూరాధ.

"ఆఁ అదే అంటావనుకొన్నాను. ఆ నిర్లిప్తత, ఆ నిర్లక్ష్యము మన వడివయస్సు స్త్రీల కావహించి మనల్ని ఎందుకూ కొరగాని వాళ్ళని చేస్తున్నది. పెండ్లి అయి పోగనే ఏంతో పెద్దరికాన్ని ఆరోపించుకొని —సంతాన వతులు కాగనే ముసలి వాళ్ల మయిపోతాం. ఏం! భర్తలు దొరికేవరకేనా స్త్రీకి అలంకారము - అంద చందాలు — వైటేఁగులూ ... వగైరా ... వగైరా ... కట్టుకున్న భర్తకి — చింకి చీరతో తిండి పెట్టి— అప్పైన టిఫిన్ కట్టి ఆఫీసుకు పంపడంతోటే అయిపోయిందా, మన బాధ్యత. భర్తని అనవరతం ఆకర్షిస్తూ, ప్రేమిస్తూ ప్రేమించబడే స్త్రీకి అంతకన్నా కావల్సిందిఇంకేమున్నది..." ఆవేశంగా అంది విమల.

"బాగుంది విమలా! నువ్వనేది. పెండ్లయిన కొత్తల్లోలాగ ఎప్పుడూ చెట్టాపట్టా లేసుకొని తిరగటానికి పిల్లలున్న తల్లికెలా కుదురుతుంది?" కొంచెం కోపంగా అంది అనూరాధ.

"పిల్లలు! నిజమే కాదనను. పిల్లలకు తల్లిగా మనం చేయవలసింది చాలా వుంది. కాని తల్లి పాత్రతో పాటు మనం భార్య పాత్రని కూడా నిర్వహించాలి కదా! నీ సంగతే తీసుకుందాం. పిల్లలు ముగ్గురు పెద్దవాళ్ళయ్యారు. చిన్నప్పటిలాగు కుదరదు స్వేచ్ఛగా తిరగటానికి. ఇప్పుడేం అడ్డున్నదని నువ్వు మీ వారితో కాశ్మీరు వెళ్ళటం లేదు! నీ శుష్క వాదన కట్టిపెట్టి కాస్త ఆలోచించు. తన భార్య, తనకన్నా పదేళ్లు పెద్దగా కన్పించాలని ఏ మగాడు అనుకోడు. ప్రతి నిత్యం పది మందిలో తిరిగే ఎగ్జిక్యూటివ్ తన స్టేటస్‌కి తగ్గ లెవల్‌లోనే తన భార్య వుండాలని ఆశిస్తాడు. అందులో ఏ మాత్రం తప్పులేదు. తనతో పాటు పార్టీలకి, ఫంక్షన్స్‌కి తన భార్యను కూడా తీసుకెళ్లాలని, తన భార్యనుచూపి, అన్నిటా తనకి తగ్గ భార్యంటూ కొలీగ్స్ అనుకుంటుంటే విని ఆనందించాలని ఆశ పడ్తాడు. ముడిమిని పులుముకొని, రిజిడిటీ పెంచుకొని, రెస్పాన్స్‌లేని తన భార్యలనుండి మగవారు పారిపోతున్నారంటే అందుకు కారణం ఎవరు...? డబ్బు... దర్పం అన్నీ వున్న మధ్య వయస్కులైన మగవారు కొందరు ఫేషనబుల్ సర్కిల్స్‌లో తిరుగుతూ, తమకన్న పదీ— పదైదేండ్ల చిన్నవారైన కన్నె పిల్లలతో, మొదట స్నేహంతో ప్రారంభించి, అఫైర్ సాగించి, భార్యా బిడ్డలకు దూరమై పోవటం కళ్లారా చూస్తూనే వున్నాం...

ఐ యామ్ సారీ... చాలా దూరం వెళ్లి పోయాం. డిసీజ్ ఆల్ [illegible]ు కన్విన్స్ యు. చదువుకున్న దానివి. చక్కటి దానివి. ఇంత దూరం చెప్పించుకోవాలా...? ఊఁ... గెట్ రెడీ... నువ్వు కూడా మీ వారితో కాశ్మీరు వస్తున్నట్లు చెప్పు..." మారిపోసింది విమల.

"విమలా! ఈ లాస్ట్ మినిట్‌లో ఇదెలా సాధ్యం! అయినా, మావారు నన్ను మాట వరుసకు కూడా రమ్మనలేదే...!" ఆగలేక పోయింది, అనూరాధ.

"అంటేమీవారు ఈముదుసల్ని యింట వుంచి వడుచు పెళ్ళాంతో కాశ్మీర్ వెళు తున్నారా! వాట్ డు యు మీన్...!"


నిగ్రహించుకోలేని అనూరాధ-విమల ఒడిలో తలపెట్టి వెక్కివెక్కి ఏడ్వసాగింది.

"ఛా.. పూర్ అనూ! నేను యధా లాపంగ అన్నదానికే నువ్వింత బాధ పడుతున్నావే, నిజంగా మీవారు ఎవరితోనైనా తిరిగితే నువ్వు సహించగలవా? ఇప్పుడిలా అధైర్యపడిలాభంలేదు లే...! ఎప్పటికేపొద్దు పోయింది. నిన్నింట్లో డ్రాప్‌చేసివస్తాను," సోఫాలోంచి లేస్తూ అంది, విమల.

* * *

"గీతా...! మీ అమ్మ ఎక్కడి కెళ్ళిందమ్మా...!?" అన్నీ సమకూరుస్తూ, అందిస్తూ తన్నంటి పెట్టుక తిరిగే భార్య చెంతలేక పోవటంతో, చచ్చే చిరాగ్గవుంది మోహన్‌రావుకి.

"ఇప్పుడే వస్తానంటూ—విమలా ఆంటీ వాళ్ళింటికెళ్ళింది డాడీ-మమ్మీ ఏం...డాడీ



## అణుశక్తి ఉత్పత్తి జపానుకు రెండవ స్థానం

ఇప్పటివరకు ప్రపంచంలో అణుశక్తి ఉత్పత్తిలో బ్రిటన్‌దేశం రెండవ స్థానం అలంకరించింది. అయితే ఇప్పుడా స్థానం జపాను ఆక్రమించింది. జపానులో ప్రస్తుతం 10 మిలియన్ కిలోవాట్ల అణుశక్తిని ఉత్పత్తి చేయగల జనరేటర్లు వున్నవి. క్రిందటి సంవత్సరం ఆఖరికి 18 అణుశక్తి జనరేటర్లు వుండేవి. మరి యిప్పుడో నాలుగు అదనంగా చేర్చబడ్డాయి. అందుమూలంగా 11 మిలియన్ల కిలోవాట్ల అణుశక్తి ఉత్పత్తి చేయవచ్చునన్న మాట. ప్రపంచం మొత్తంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు ప్రథమ స్థానాన్ని పొంది యున్నవి. 1977 సంవత్సరం ఆఖరికి అమెరికా సంయుక్త రాష్ట్రంలో 50 మిలియన్ కిలోవాట్ల అణుశక్తిని ఉత్పత్తి చేసేవారు. అప్పట్లో బ్రిటనులో 8.8 మిలియన్ల కిలోవాట్ల ఉత్పత్తి అయ్యేది. సోవియట్ యూనియనులో 8.2 మిలియను కిలోవాట్ల అణుశక్తి పశ్చిమ జర్మనీలో 7.3 మిలియన్ల కిలోవాట్స్ ఉత్పత్తి అవుతున్నది.

జపానులో 1985 నాటికి 29 జనరేటర్ల మొత్తం 21,891,000 కిలోవాట్ల అణుశక్తిని ఉత్పత్తి చేయడానికి ఎనర్జీ రిసెర్చ్ కౌన్సిలు వారు ఒక పథకాన్ని రూపొందించారు. ★

## శ్రీవారి తీరు

మీ కేమన్నా కావాలా...?" గీతకి కష్టంగా వుంది వాళ్ళమ్మ ప్రవర్తన. నాన్నతో కాశ్మీరు కల్సివెళ్ళకుంటేమానె. కనీసం వెళ్ళేటప్పుడైనా తను యింట్లో లేకపోతే ఎలా...?

"ఓ...డామిట్! నాకు ఫ్లయిట్కి టైం అవుతోంది. ఒరే ప్రభూ...! మమ్మీ—విమలగారింట్లో వుందట...కాస్త ఫోన్ చేసి చెప్పు—నే వెళ్తున్నానని." కోపంగా అన్నాడు మోహనరావు.

ఫోన్ చేసి మాట్లాడిన ప్రభు, "డాడీ! అమ్మకి ఇంటికొచ్చేందుకు టైము లేదట. పిలుంచే డైరక్టుగా బేగంపేట ఏరోడ్రోంకే వస్తానని చెప్పింది...!" అన్నాడు.

భార్య నిర్వాకానికి ఒళ్ళు మండిపోయింది మోహనరావుకి. రాత్రి అలాగే చేసింది. గీతకి వంటగా వుందంటూ పిల్లల రూములోనే పడుకుంది. తనకే అంత పట్టనప్పుడు నాకు మాత్రమేమొచ్చింది. గబగబా లేచి మాటువేసుకొని గేటు కేసి నడిచాడు మోహనరావ్. డ్రైవరు రెడీగా వున్నాడు కారు డోర్ తెరిచి పట్టుకొని.

"గీతా! ప్రభూ! వెళ్తొస్తాను. సంగీతా! టా. మమ్మీ వచ్చాక చెప్పండి..." అంటూ కారెక్కాడు, మోహనరావ్!

"డాడీ! నా కామిక్స్" అంది, సంగీత కారు వెంబడి పరుగెత్తుతూ.

"అలాగే... అలాగే..." అంటూ చెయ్యి వూపాడు, మోహనరావు.

ఢిల్లీ వెళ్ళే ఫ్లయిట్ 7-30 కి. ప్లేన్ టేకాఫ్‌కి ఇంకో అరగంటుంది. అందరూ వస్తున్నారు. "అరవింద వచ్చిందో లేదో... నిన్న ఆఫీసులో కాస్త తొందరగానే రమ్మని చెప్పానే...!" ఆలోచిస్తూ అటూ—ఇటూ చూశాడు మోహనరావు. దూరంగా బుక్ స్టాల్ దగ్గర నిలబడి ఏదో నవల తిప్పుతూంది అరవింద. ఆవిడ కేసి నడిచాడు మోహనరావు.

"అరే విమలా మూర్తిగారూ...! ఏస్... ఏస్... మిసెస్ కూడా వస్తున్నట్లు మూర్తి చెప్పాడు. తనే మరచి పోయాడు. విమల గారి ప్రక్క స్లీవ్‌లెస్‌గా స్టైల్‌గా వున్న సుందరాంగి ఎవరబ్బా...!" ఇంకాస్త దగ్గరికి వచ్చాక వులిక్కి పడ్డాడు మోహనరావు. అందంగా, హుందాగా డ్రెస్సు అయి అరవిందతో మాట్లాడుతున్నది— అన్ను— తన భార్య అనూరాధ. చక్కటి చిరునవ్వు ముఖంలో చిందులేస్తోంది. ఎప్పుడూ నడినెత్తికి చుట్టుకునే ముడిప్లేస్, బాండ్ వేసి వదిలేసిన జుట్టు అందంగా ఎగురుతూంది. రంగు వెలిసి, నలిగిన చీర స్థానే ప్రింటెడ్ షిఫాన్ చీర వంటిమీద రెపరెప లాడుతూంది.

భార్యనే తదేకంగా చూస్తూ మాటలురానివాడే అయ్యాడు మోహనరావు. చక్కటి రంగుతో ఒడ్డూ—పొడవుతో స్లీవ్‌లెస్‌గావున్న అనూరాధ ముందు, పొట్టిగా బొద్దుగా వున్న అరవింద వెలవెలా పోతూంది.

ముందుగా విమలే పలకరించింది.

"ఏంటండోయ్ మోహనరావు గారూ! అలా తెల్లబోయి నిలబడ్డారు. మీ భార్యే నండి బాబూ! ఇంట్రొడ్యూస్ చెయ్యమంటారా?" కొంటెగా అడుగుతున్న విమల కేసి చూసి చిన్నగా నవ్వింది అనూరాధ. ఆ నవ్వులో కూడా ఏదో క్రొత్తదనం కన్పించింది మోహనరావుకు. భార్య అనూరాధని, పి. ఏ అరవిందని ప్రక్క ప్రక్కనే చూస్తుంటే గబరాగ కూడా వుంది. ఎవ్వరూ లేకుండా తనూ అనూ మాత్రమే వుంటే బాగుండునని పిస్తోంది. అనవసరపయాణమే మానుకొని అనూని వెంటపెట్టుకుని ఇంటికెళ్తేనో ...!

"మీ రేమీ అనుకోనంటే ఓ చిన్న రిక్వెస్ట్ సార్!"— అరవింద. ఏమిటన్నట్టు చూశాడు మోహనరావు, అరవింద కేసి.

'నేను టిక్కెట్ కాన్సెల్ చేసుకుంటున్నాను!'

"హౌ ఈజిట్ పాజిబుల్...అట్ దిస్ లాస్ట్ మినిట్...?"

"క్వయిట్ పాజిబుల్ సర్. ఆ టికెట్ మీద అసలైన మిసెస్ మోహనరావుగారు వెళతారు. నో ప్రాబ్లం...!" అరవింద, అనూరాధ కేసి చూసింది.

"యస్." అన్నట్లు భర్త కేసి నవ్వింది, అనూరాధ.

"మరి పిల్లలు" అన్నాడు మోహనరావు.

"నాకు తెలుసు. పిల్లలేమి అయిపోరు ఈ నాలుగు రోజుల్లో. ఇప్పుడే గీతకి ఫోన్ చేసి చెప్పాను." తన చెవులను తానే నమ్మలేక పోయాడు, మోహనరావు.

ఫార్మాలిటీస్ పూర్తిగావించుకొని ప్లేను కేసి జంటగా నడుస్తున్న మోహన్‌రావ్—అనూరాధలను చూసి, చిలిపిగా నవ్వుకొని, విమల తన భర్త దగ్గరికి నడిచింది.

"అనూ, యు ఆర్ సింప్లీ స్మాషింగ్" పైపైకి ఎగసి పోతున్న విమానంలో పక్కనే కూచున్న పరువంపు భార్య చెవిలో గుసగుసలు పోయాడు, మోహనరావు.

అనూరాధ అంతరంగం ఆనందంతో పరవళ్ళు త్రొక్కుతూంది.